క్లుప్తంగా

డీఈవోకు సత్కారం



డీఈవో ప్రేమ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఆరిలోవ: జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌ను డీఈవో కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌ను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా డీఈవోను ఘనంగా సత్కరించి అభినందించారు. ఇటీవల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అన్ని ఉపాధ్యాయ సంఘాలు, విద్యా శాఖాధికారులు, సిబ్బంది సహకారంతో కౌన్సెలింగ్ ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి డీసీఈబీ సెక్రటరీలు ఎం.వి.కృష్ణకుమార్, సత్యనారాయణ, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు, ఉపాధ్యక్షుడు జి.వరహాల దొర, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు లలిత్‌కుమార్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ దేముడు పాల్గొన్నారు.

విస్తృతంగా యోగా శిక్షణ

ఎంవీపీకాలనీ: యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా తూర్పు నియోజకవర్గంలోని పలు వార్డుల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఎంవీపీ కాలనీ, శివాజీపాలెం, చినవాల్తేరు, బీచ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నగర ప్రజలను ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములు చేసే దిశగా జీవీఎంసీ, జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. వార్డుల వారీగా తూర్పు నియోజకవర్గంలోని అనేక చోట్ల కొన్ని రోజులుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆర్పీలు, ఆశా వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, స్వయం ఉపాధి సంఘాల మహిళలు పాల్గొంటున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విభాగ విద్యార్థులైన పలువురు ట్రైనర్ల ద్వారా యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో రికార్డు నెలకొల్పే దిశగా ప్రోత్సహిస్తున్నారు.

ఉత్సాహంగా యోగాసనాలు



ఆస్పత్రి ఆవరణలో యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, వైద్య సిబ్బంది

ఆరిలోవ: విశాఖ బీచ్ రోడ్డు వేదికగా ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనడానికి పలు సంస్థలు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం హెల్త్‌సిటీలోని మెడ్‌సీ ఆస్పత్రి ఆధ్వర్యంలో యోగాసనా ల కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడ్‌సీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్టర్ల యోగా సాధన



యోగాసనాలు వేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్లు

ఏయూక్యాంపస్: యోగాంధ్ర–2025కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్టర్లు భాగమయ్యా రు. జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, కాంట్రాక్టర్లు పాల్గొని యోగాసనాలు వేశారు. వీరికి యోగాసనాలు, ధ్యానం తదితర అంశాలపై యోగా శిక్షకులు అవగాహన కల్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి.వి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, గుర్రం సింహాచలం, మద్దాల రమేష్, సిరికి శ్రీనివాసరావు, షేక్ సిలార్, పి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కొండవాలులో శంకుస్థాపన

మద్దిలపాలెం: భీమిలి నియోజకవర్గ పరిధి 15వ వార్డులోని నరసింహనగర్, బల్లంకి కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నిధులు రూ.1.15 కోట్లతో రక్షణ గోడలు, యూజీడీ పునరుద్ధరణ, తాగునీటి వసతులను కల్పించనున్నట్టు ఆయన తెలిపారు. కార్పొరేటర్ శ్రీవిద్య, జోన్–1 కమిషనర్ శివప్రసాద్, ఈఈ గంగాధర్, ఏఈ భాగ్యశ్రీ పాల్గొన్నారు.



ఎన్‌క్లోజర్‌లో ఖాళీగా పక్షుల పంజరాలు



పక్షులు, బాతులు, కుందేళ్లు కనుమరుగవడంతో బోసిపోయిన ఎన్‌క్లోజర్

ఆహ్లాదం ఆవిరి

వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా ఎన్‌క్లోజర్ నిర్వహణ గాలికి..

- కనుమరుగైన పక్షులు, బాతులు, కుందేళ్లు
- ఎండిపోయిన నీటి కొలను
- నిరాశగా వెనుదిరుగుతున్న చిన్నారులు
- అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి



సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా



ఎరీనా ఎన్‌క్లోజర్‌లో ఎండిపోయిన కొలను

బీచ్‌రోడ్డు: అది ఒక అందమైన కొలను. దాని నిండా నీరు, మధ్యలో చెట్టు. దానిపై పక్షులు, నీటిలో బాతుల కిచకిచలు.. కొలను చుట్టూ కుందేళ్ల సందడి.. ఇలా చదువుతూ ఉంటే ఎంతో బాగుంది కదా.. ఇలాంటి అనుభూతిని నగరంలోని చిన్నారులకు అందించేందుకు సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా వద్ద ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్‌లో ఏడేళ్ల కిందట కనిపించేవి. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పుడా దృశ్యాలు కనుమరుగయ్యాయి. చిన్నారులకు ఆనందం.. విజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో రూ.కోట్లతో నిర్మించిన చిల్డ్రన్ ఎరీనా పెద్దల కార్యక్రమాలకు వేదికవుతోంది. ఈ ప్రాంగణంలోని ఎన్‌క్లోజర్ నిర్వహణను ఉన్నతాధికారులు గాలికి వదిలేయడంతో పూర్తిగా కనుమరుగైంది. చిల్డ్రన్స్ ఎరీనాలో ఏదో ఉందని చూడటానికి వస్తున్న చిన్నారులకు నిరాశ మిగులుతోంది. కనీసం వీటినైనా పునరుద్ధరించి పిల్లలకు ఆహ్లాదం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కనిపించని పక్షులు, కుందేళ్లు

2018లో చిల్డ్రన్స్ ఎరీనాను ప్రారంభించినప్పుడు ఈ ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లో పక్షులు, బాతులు, కుందేళ్లు ఉండేవి. పక్షులు పంజరాల్లో ఉంటూ కిలకిల.. కిచకిచ రాగాలతో చిన్నారులను అలరించేవి. కుందేళ్లు చిట్టి పొట్టి అడుగులతో పిల్లలను మైమరపించేవి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పక్షుల కిచకిచలు.. కుందేళ్ల కవ్వింపులు కరువైయ్యాయి. ఇప్పుడు ఎన్‌క్లోజర్‌లోని పక్షులు, బాతులు, కుందేళ్లు కనుమరుగయ్యాయి..

ఎండిపోయిన కొలను

వీఎంఆర్‌డీఏ అధికారుల నిర్లక్ష్యంతో ఎన్‌క్లోజర్ లోని నీటి కొలను పూర్తిగా ఎండిపోయింది. దీంతో ఎన్‌క్లోజర్ మొత్తం బోసిపోయి నిరుపయోగంగా పడి ఉంది. దీనిలో ఉన్న పక్షులు, కుందేళ్లను చూస్తూ కాసేపు సరదాగా గడుపుదామనుకుని ఎరీనాకు వస్తున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులకు ఆనందం.. ఆహ్లాదం అందకుండా ఆవిరై పోయింది.

చిల్డ్రన్స్ ఎరీనా ధ్యేయం నిర్వీర్యం

చిన్నారులకు విజ్ఞానం, వినోదం అందించాలన్న ధ్యేయంతో వీఎంఆర్‌డీఏ నిర్మించిన చిల్డ్రన్స్ ఎరీనా పెద్దలకు సొంతమైంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల చిన్నారులకు ఆహ్లాదం అందించే పక్షులు, కుందేళ్లు, బాతులు కనుమరుగయ్యాయి. పేరుకే చిల్డ్రన్స్ ఎరీనా కానీ.. ఇక్కడ పిల్లలకు సంబంధించిన ఒక్కటి కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. పిల్లల ప్రాంగణం అనుకుని ఆసక్తిగా అక్కడికి వెళ్తున్న చిన్నారులకు ఇది పెద్దల కోసం మాత్రమేనని తెలిసి నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఏ ధ్యేయంతో చిల్డ్రన్స్ ఎరీనాను నిర్మించారో.. అది పూర్తిగా నిర్వీర్యమైందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాకు పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నారు.

'యోగాంధ్ర' పనుల్లో నాణ్యత డొల్ల..!



ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు



వర్టికల్ గార్డెన్‌లో మొక్కలు నాటుతున్న కార్మికులు

ఏయూక్యాంపస్: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖ బీచ్ రోడ్డు వేదికగా జరగనుంది. ఈ నేపథ్యంలో తీరంలో అవసరమైన ఏర్పాట్లు అధికారులు ప్రారంభించారు. ఇప్పటికే రహదారికి ఇరువైపులా బారికేడ్ల నిర్మాణాన్ని పూర్తిచేశారు. ప్రస్తుతం ఫుట్‌పాత్‌పై ఎల్‌ఈడీ లైట్లు ఏర్పా టు చేసే పనులు వేగంగా జరుగుతున్నాయి. అదే సమయంలో ఫుట్‌పాత్‌లకు రంగులు వేయడం, డివైడర్లకు రంగులు వేసే పనులను సైతం వేగంగా చేస్తున్నారు. సముద్రానికి మరోవైపున ఉండే లాన్‌ల చుట్టూ ఆకుపచ్చ, తెలుపు రంగులు వేస్తున్నారు. తీరంలో కొలువుదీరిన మహనీయుల విగ్రహాలకు శరవేగంగా రంగులు వేస్తున్నారు. కార్మికులు ఏకకాలంలో విభిన్న పనులను పూర్తి చేస్తున్నారు. పాండురంగా పురం వద్ద ఉన్న వర్టికల్ గార్డెన్‌లో గతంలో నాటిన మొక్కలు చనిపోయాయి. వీటి స్థానంలో కొత్త మొక్కలు నాటే పనులు జరుగుతున్నాయి. గతంలో ఈ వర్టికల్ గార్డెన్‌లో ఒక్కో వరసలో ఒక్కో విధమైన మొక్కలు నాటేవారు. ప్రస్తుతం ఒకే విధమైన మొక్కలను నాటుతున్నారు. ఈ పనులు కేవలం యోగా డే వేడుకల వరకే పరిమితమవుతున్నాయి. పనుల్లో నాణ్యత అంతంత మాత్రంగానే ఉంటోందని చూస్తేనే అర్థమవుతోంది. దీర్ఘకాలిక ప్రయోజనం దృష్ట్యా ఈ పనులు పూర్తిచేస్తే బాగుంటుందని నగరవాసులు సూచిస్తున్నారు. ప్రజాధనం ఖర్చు చేస్తున్న తరుణంలో పనుల నాణ్యతపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముందని చెబుతున్నారు.

గోల్ఫ్ క్లబ్‌ను సందర్శించిన జెడ్సీ



బ్యాటరీ కారుపై గోల్ఫ్ క్లబ్‌లో మైదానాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

ఆరిలోవ: జీవీఎంసీ జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి ఆదివారం ముడసర్లోవ పార్కు వద్దనున్న గోల్ఫ్ క్లబ్‌ను సందర్శించారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి గోల్ఫ్ క్లబ్‌ను కూడా వినియోగించనున్నారు. ఈ సందర్భంగా గోల్ఫ్ క్లబ్‌లో మైదానాన్ని ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణం గల ఈ మైదానంలో 40 వేల నుంచి 50 వేల మందితో యోగాసనాల కోసం సన్నాహాలు చేస్తున్నట్లు జెడ్సీ తెలిపారు. యోగాసనాలకు వచ్చిన వారి వాహనాల పార్కింగ్‌కు జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలాలు, ముడసర్లోవ వెనుక రోడ్లను వినియోగించనున్నామన్నారు. అనంతరం పార్కింగ్ కోసం ఆయా ఖాళీ స్థలాలను కూడా ఆమె పరిశీలించారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



ఈఎంసీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న ఎ.కె.ఖాన్ తదితరులు

బీచ్‌రోడ్డు: ఎతిహాద్ ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ముఖ్య అతిథిలు మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎ.కె.ఖాన్, రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎ.ఎం.డి.ఇంతియాజ్ చేతుల మీదుగా స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎ.కె.ఖాన్ మాట్లాడుతూ 175 మంది పేద విద్యార్థులకు సొసైటీ ద్వారా రూ.17,50,000 స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులతో సంభాషించి, భవిష్యత్తు ఆకాంక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమాధానాలు విని ఆయన సంతోషించారు. ఎ.ఎం.డి.ఇంతియాజ్ మాట్లాడుతూ పిల్లలు ఎల్లప్పుడూ నాణ్యమైన విద్య పొందడానికి అవసరమైన మద్దతివ్వాలన్నారు. ఈఎంసీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఐ.హెచ్.ఫారూఖీ మాట్లాడుతూ తమ సంఘం ద్వారా చాలా ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కాలర్‌షిప్‌ల పంపిణీ ద్వారా నిరుపేద పిల్లలు నాణ్యమైన విద్యను పొందేందుకు, వారి లక్ష్యాలను సాధించడానికి ఆర్థికంగా వారిని ప్రోత్సహించడానికి మద్దతిస్తున్నామన్నారు. పేద పిల్లలు, వారి కుటుంబాలను ఆదుకునేందుకు అత్యంత ప్రాధాన్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి జాఫర్ హుస్సేన్, ట్రెజరర్ రియాజ్ ఖాన్, ఈఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

'కూటమి' మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న 20వ వార్డు శ్రేణులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులో కార్పొరేటర్ ముప్పల లక్ష్మి సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు చేసిన మోసం గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలు ఇప్పుడు అందకపోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వార్డులో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పల సురేష్, వార్డు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాలకు దూరంగా ఉండాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎంవీపీ ఎస్ఐ ధనుంజయ్‌నాయుడు

ఎంవీపీకాలనీ: రౌడీషీటర్లు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని ఎంవీపీ ఎస్ఐ ధనుంజయ్‌నాయుడు సూచించారు. ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడుతూ ఏ ఒక్కరూ నేర ప్రవృత్తిని కలిగి ఉండరాదన్నారు. నగరంలో జరిగే సంఘటనల్లో రౌడీషీటర్ల పాత్ర ఉందని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

శ్రావ్యంగా సంగీత కచేరి



గాత్ర కచేరి చేస్తున్న రమ్య కిరణ్మయి బృందం

మద్దిలపాలెం: త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ కార్యక్రమాల్లో భాగంగా వాగ్గేయకారుల జయంత్యుత్సవాల సందర్భంగా ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గాత్ర విద్వాంసురాలు రమ్య కిరణ్మయి గాత్ర సంగీత కచేరి శ్రావ్యంగా సాగింది. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, రాంబాబులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రమ్య కిరణ్మయి పలు త్యాగరాజు కీర్తనలు అద్భుతంగా ఆలపించి పరవశింపజేశారు. సుబ్బరాయ శాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్ తదితర వాగ్గేయకారుల కృతులను పాడి సమ్మోహన పరిచారు. కార్యక్రమంలో వయొలిన్ విద్వాంసుడు ×సంగీత కళాభారతి× బిరుదాంకితుడు ఎం.ఎస్.ఎన్.మూర్తి వయొలిన్‌పై వాయించడం కచేరీకి వన్నెతెచ్చింది.

మనస్తాపానికి గురై ఉరివేసుకున్న యువకుడి మృతి

బీచ్‌రోడ్డు: మనస్తాపానికి గురై ఈ నెల 12వ తేదీన ఉరి వేసుకున్న యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. షణ్ముఖ(20) అనే యువకుడు ఏయూలో నాలుగో తరగతి ఉద్యోగినైన తన పెద్దమ్మ క్వార్టర్స్‌లో ఉంటూ ఆదిత్య డిగ్రీ కాలేజీలో సెకండియర్ చదువుతున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల తీవ్ర మానసిక క్షోభకు గురికావడంతో ఈ నెల 12న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. పోస్టుమార్టం నిమిత్తం షణ్ముఖ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

మురుగు ప్రవాహం కనిపించకుండా పైపులతో కవరింగ్



సిద్ధం చేసిన సిమెంట్ పైపులు



సాగర తీరం వద్ద మురుగు నీటి ప్రవాహం కనిపించకుండా చేపడుతున్న నిర్మాణం

ఏయూ క్యాంపస్: సాగర తీరం వద్ద మురుగు నీరు ప్రవహించే ప్రాంతాల్లో పైపులతో కవర్ చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కలుషితమైన మురుగు నీరు నేరుగా సాగరంలోకి కలవకూడదు. అది సముద్ర జీవులకు ఎంతో నష్టం చేకూరుస్తుంది. తీరం పొడవునా పలు ప్రాంతాల్లో నగరంలోని మురుగు కాలువల నుంచి వచ్చే నీరు గెడ్డల ద్వారా సముద్రంలోకి చేరుతోంది. ఇది సాగరంలో కలిసే ప్రాంతాల వద్ద నిత్యం మురుగు నీరు ప్రవాహం కనిపిస్తోంది. ప్రధాని మోదీ విశాఖ పర్యటన నేపథ్యంలో అధికారులు కొంత జాగ్రత్త పడుతున్నారు. మురుగు నీరు సముద్రంలోకి నేరుగా కలవకుండా శుద్ధిచేసి విడుదల చేయాలి. ఈ దిశగా ఆలోచన చేయని అధికారులు కాస్త తెలివిగా పనిచేస్తున్నారు. బీచ్ రోడ్డును ఆనుకుని సముద్రంలోకి మురుగు ప్రవహించే ప్రాంతాల్లో ఇసుకలో నుంచి సిమెంట్ పైపులను వేస్తున్నారు. వీటి నుంచి మురుగు నీరు నేరుగా సముద్రంలోకి చేరిపోతుంది. బయటకు ఎటువంటి ప్రవాహం కనిపించదు. విక్టరీ ఎట్ సీ వద్ద దీనికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సిమెంట్ పైపులను సిద్ధం చేశారు. ప్రస్తుతం కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. సముద్ర తీరంలో ఇసుక తిన్నెలపై సిమెంట్ పైపులు వేసి వాటి నుంచి మురుగు నీరు ప్రవహించే విధంగా పనులను ఆఘమేఘాల మీద పూర్తి చేస్తున్నారు. ఈ నెల 21న విశాఖ బీచ్ రోడ్డు వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాన మంత్రితో సహా 40 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో సముద్ర తీరంలో మురుగు నీటి ప్రవాహం కనిపించకుండా అధికారులు జాగ్రత్తలు పడుతున్నారు.

జీవం కోల్పోయిన శాంతివనం

సుందరంగా తీర్చిదిద్దాలని సందర్శకుల విజ్ఞప్తి



విక్టరీ ఎట్ సీ వద్ద పార్క్‌లో శాంతి స్థూపం దుస్థితి



రంగులు వెలిసిన శిల్పాలతో కళావిహీనంగా శాంతివనం ప్రాంగణం





యోగా వేడుకల కోసం శాంతివనం పార్క్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన కళాకృతులు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు బీచ్ రోడ్డును ముస్తాబు చేస్తున్నారు. దీనిలో భాగంగా రహదారి పక్కనే ఉన్న పచ్చిక బయళ్లు, తీరంలోని పలు ప్రాంతాల్లో వివిధ రంగుల పుష్పాలతో కూడిన వృక్షాల నమూనాలు, తాబేలు మొదలగు అనేక బొమ్మలను ఏర్పాటు చేస్తున్నారు. విక్టరీ ఎట్ సీకి ఎదురుగా ఉన్న శాంతివనం పార్క్‌లో తాజాగా రెండు బొమ్మలు ఏర్పాటు చేశారు. అదే సమయంలో పార్క్‌లో ఉన్న శాంతి స్థూపం, దాని చుట్టూ ఉన్న పరిసరాలు పూర్తిగా దెబ్బతిన్నా.. పట్టించుకోలేదు. వీటికి మరమ్మతులు చేసి సుందరంగా తీర్చిదిద్దాలనే ఆలోచన మాత్రం అధికారులకు రాలేదు. పైపై మెరుగులు దిద్ది యోగా డే వేడుకలను ఆర్భాటంగా నిర్వహించాలని ఆలోచిస్తున్న అధికారులు నిత్యం సందర్శకులు, నగరవాసులు సేదతీరే పార్క్‌ను ఆధునికీకరించాలనే ఆలోచన మాత్రం చేయడం లేదు. శాంతివనం పార్క్ మధ్యలో ఉన్న శాంతి స్థూపానికి ఒకవైపు పలక ఊడిపోయింది. దీని చుట్టూ ఉన్న మానవ ముఖాన్ని పోలిన శిల్పాల రంగులు వెలిసిపోయి కళావిహీనంగా మారాయి. వీటిని మార్చడం, రంగులు వేయడం ఎంతో అవసరం. పార్కు మధ్య భాగంలో ఉన్న శాంతి స్థూపం చుట్టూ ఉన్న నిర్మాణంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. అధికారులు ఈ పార్క్ ఆధునికీకరణపై దృష్టి సారించాలని నగరవాసులు సూచిస్తున్నారు. పైపై మెరుగు లు కాకుండా, క్షేత్రస్థాయిలో సాగర తీరాన్ని మరింత ఆకర్షణీయంగా, సుందరంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

విమాన ప్రమాద మృతులకు శాంతి కలగాలి



కరపత్రాల ద్వారా శాంతిని తెలియజేస్తున్న బాల వికాస్ ఫౌండేషన్ సభ్యులు

మద్దిలపాలెం: అహ్మదాబాద్ విమాన ప్రమాద దుర్ఘటనలో మరణించిన వారికి శాంతి కలగాలని కోరుతూ ఆదివారం హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరపత్రాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి ప్రకాశరావు మాట్లాడుతూ ఈ సంఘటన చాలా దురదృష్టకరమని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బాబి, బి.గణేష్, పి.ఎస్.వి.కుర్నేష్, డి.రమణమూర్తి, ఎ.రామకృష్ణ, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.